సాక్షి
నిర్మల్
సోమవారం : 18 : నవంబర్ : 2024



భయం గుప్పిట్లో గ్రామాలు

జిల్లాలో శుక్ర, శనివారాల్లో పెద్దపులి సంచరించిన విషయం తెలిసిందే. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం నాగాపూర్ గ్రామంలోనూ కనిపించింది. 8లో▸



సరిహద్దులో ఆధ్యాత్మికం

సరిహద్దు ప్రాంత గ్రామాల ప్రజలు నేటికీ మహారాష్ట్ర సంప్రదాయాలు కొనసాగిస్తున్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ భక్తిమార్గంలో పయనిస్తున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
30.0 / 16.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రి వేళ, వేకువజామున చలితీవ్రత అధికంగా ఉంటుంది. మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

తరుగు లేకుండా ధాన్యం దిగుమతి చేసుకుంటాం



మాట్లాడుతున్న అసోసియేషన్ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ఎఫ్ఏక్యూ నిబంధనల ప్రకారం ధాన్యాన్ని తరుగు లేకుండా దిగుమతి చేసుకుంటామని బాయిల్డ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సాదుల కృష్ణదాస్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. రైతులు ధాన్యాన్ని శుభ్రం చేసి పంపాలని సూచించారు. నిబంధనల ప్రకారం ధాన్యం మిల్లులకు వచ్చిన వెంటనే దిగుమతి చేసుకుంటామని పేర్కొన్నారు.

అడెల్లిలో భక్తుల సందడి



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

సారంగాపూర్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన అడెల్లి మహాపోచమ్మ ఆలయం ఆదివారం భక్తజనంతో కిటకిటలాడింది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాలైన నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్‌తోపాటు మహారాష్ట్ర నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో రమేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా స్థానిక ఎస్సై శ్రీకాంత్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆలయ హుండీ లెక్కింపు



హుండీ డబ్బులు లెక్కిస్తున్న వీడీసీ సభ్యులు

సోన్: మండలంలోని న్యూబొప్పారం గ్రామ హనుమాన్ ఆలయ హుండీ డబ్బులను వీడీసీ సభ్యులు ఆదివారం లెక్కించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్తిక పౌర్ణమి సందర్భంగా భక్తులు వేసిన కానుకల ద్వారా రూ.62,580 నగదు, 2.3 గ్రాముల మిశ్రమ బంగారం, 49 గ్రాముల వెండి వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేశెట్టి నవీన్, గౌతమ్ రెడ్డి, బీజీ రెడ్డి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మకు మొక్కులు



అన్నదానం చేస్తున్న దామోదర్‌రెడ్డి

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారం గ్రామంలో గల పోచమ్మ ఆలయాన్ని ఆదివారం భక్తులు సందర్శించారు. అమ్మవారికి పూజలు చేసి మొక్కు తీర్చుకున్నారు. మండలంలోని పీచర గ్రామానికి చెందిన వైద్యుడు దామోదర్‌రెడ్డి మొక్కు తీర్చుకుని తన గ్రామస్తులందరికీ పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు విక్రమ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి పాల్గొన్నారు.

నూతన నియామకం



గోవింద్‌నాయక్ నుంచి నియామకపత్రం అందుకుంటున్న ప్రేమ్‌దాస్

లక్ష్మణచాంద: కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన ధరావత్ ప్రేమ్‌దాస్ నియమితులయ్యారు. ఆదివారం జిల్లా కేంద్రంలో పార్టీ జిల్లా నాయకుడు గోవింద్‌నాయక్ చేతుల మీదుగా ప్రేమ్‌దాస్ నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. తన నియామకానికి కృషి చేసిన డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుకు కృతజ్ఞతలు తెలిపారు.



జిల్లా కేంద్రంలో చలిమంట కాగుతున్న వృద్ధులు

చలిపంజా

- జిల్లాలో తగ్గిన కనిష్ట ఉష్ణోగ్రతలు
- వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం
- వృద్ధులు, చిన్నారులు జెర పదిలం
- అప్రమత్తంగా లేకుంటే అనర్థాలే..

జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతల వివరాలు

తేదీ	డిగ్రీలలో..
17న	13.1
16న	13.8
15న	14.2
14న	14.8
13న	14.8

నిర్మల్‌ఖిల్లా: వారంరోజులుగా జిల్లాలో ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుతున్నాయి. దీంతో రాత్రివేళ శీతల గాలులతో పాటు చలి ఇంతకింతకూ పెరుగుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రధానంగా సహ్యాద్రి పర్వత శ్రేణులు, అటవీ ప్రాంతం వ్యాపించి ఉంది. దీంతో చలి తీవ్రత అధికంగా ఉంటోంది. రాష్ట్రంలో ఏటా అత్యల్ప ఉష్ణోగ్రతలు ఉమ్మడి జిల్లాలోనే నమోదవుతుండటం ఇందుకు నిదర్శనం. చలికాలం జలుబు, దగ్గు, జ్వరం, శ్వాసకోశ సమస్యలు ఎక్కువగా చిన్నారులు, వృద్ధుల్లోనే కనిపిస్తుంటాయి. ఈ కాలంలో వైరస్, బ్యాక్టీరియా కూడా సులభంగా వ్యాప్తి చెందే ప్రమాదముంది. వచ్చే రెండు, మూడు నెలలు ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. దీంతో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశముంటుందని వాతావరణశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. చిన్నపిల్లల తల్లిదండ్రులు ఈ సమయంలో వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని వైద్యులు సూచిస్తున్నారు. వృద్ధులు కూడా చలి తీవ్రత నుంచి తట్టుకునేందుకు తప్పనిసరిగా తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

శ్వాస, గొంతు సమస్యలే అధికం

నవంబర్, డిసెంబర్, జనవరి వరకు చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. చలికాలంలో జలుబు, దగ్గు రావడంతో పాటు ఇతర కండరాలు కుంచించుకుపోతాయి. రక్తనాళాలు గడ్డకట్టుకుపోయి ఇతర జబ్బులు కూడా వచ్చే ఆస్కారముంది. ప్రస్తుతం చలికాలం ప్రారంభ దశలో ఉండటంతో చిన్నారులు, వృద్ధుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరముంది. వాతావరణ మార్పులకు అనుగుణంగా జ్వరం, జలుబు, దగ్గు శ్వాస సమస్యలు ఉత్పన్నమవుతాయి. దీంతోపాటు తలనొప్పి, గొంతు సమస్యలు కూడా తలెత్తుతుంటాయి. ప్రధానంగా జలుబు కారణంగా ముక్కు కారుతుంది. శ్వాస పీల్చడంలో ఇబ్బందులు తలెత్తుతాయి. ఈ ప్రభావంతో చెవి పక్కన వాపు వచ్చే అవకాశాలుంటాయి. దీనికి తోడు గవదబిళ్లల వాపు వచ్చి శ్వాస తీసుకోవడంలో సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఇక శరీరంలో కీళ్ల నొప్పులు, కండరాలు బిగుసుకుపోవడం, రక్తనాళాల్లో గడ్డ కట్టడం లాంటి సమస్యలూ ఏర్పడతాయి.



జిల్లా కేంద్రంలోని రహదారిని కమ్మిన పొగమంచు



జిల్లాకేంద్రంలో వెలిసిన ఉన్నిదుస్తుల దుకాణం

తీసుకోవాల్సిన జాగ్రత్తలివే..

చలికాలంలో తగిన జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రధానంగా చల్లని పదార్థాలు, శీతల పానీయాలకు దూరంగా ఉండాలి. వేడిగా ఉన్నప్పుడే ఆహారం తీసుకోవాలి. శరీరాన్ని వెచ్చగా ఉండేలా చూసుకోవాలి. ఫ్రిడ్జ్‌లలో నిల్వచేసిన పదార్థాలు, చల్లని నీటిని తీసుకోకూడదు. ఐస్‌క్రీమ్, చల్లని పండ్ల రసాలు తీసుకోరాదు. శరీరానికి వేడినిచ్చే రాగులు, సజ్జలు, జొన్నలతో చేసిన ఆహార పదార్థాలు, ఆకుకూరలను ఎక్కువగా తీసుకోవాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో గోరువెచ్చని నీటినే తాగాలి. రాత్రి వేళ బయటకు వెళ్లవద్దు. అత్యవసరమైతే ఉన్ని దుస్తులు ధరించి వెళ్లాలి. ఉదయం, రాత్రి వేళల్లో బ్యాక్టీరియా, వైరస్‌ల వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. ఈ సమయాల్లో జనసమూహాల మధ్యలోకి వెళ్లవద్దు. ఇల్లు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. చిన్నపిల్లలను మట్టిలో ఆడనివ్వరాదు. చేతులను తరచూ సబ్బుతో కడుక్కోవాలి. దగ్గు, జలుబు ఉంటే చేతి రుమాలు ఉపయోగించాలి.

జాగ్రత్తలు తప్పనిసరి



చలికాలంలో వైరస్, బ్యాక్టీరియా వ్యాప్తి అధికంగా ఉంటుంది. ఈ కారణంగా జబ్బుల బారిన పడే అవకాశముంది. మూడునెలల పాటు ప్రధానంగా చిన్నపిల్లలు, వృద్ధుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఉన్ని దుస్తులు ధరించాలి. ఆహార పదార్థాలు వేడిగా ఉన్నప్పుడే తినాలి. పిల్లలను ఐస్‌క్రీమ్‌లు, ఫ్రిడ్జ్ వాటర్‌కు దూరంగా ఉంచాలి.

– నాలం స్వప్న, చిన్నపిల్లల వైద్యనిపుణులు, నిర్మల్

అందుబాటులోకి యోగా సెంటర్లు



జిల్లా జనరల్ ఆస్పత్రిలో నిర్మించిన షెడ్డు

- జిల్లాకు 10 కేంద్రాలు మంజూరు
- 20మంది ట్రైనర్ల నియామకం
- ఇప్పటికే షెడ్ల నిర్మాణం పూర్తి
- వారంలో ఉచిత శిక్షణ మరూ..



నియమితులైన ట్రైనర్లు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రస్తుత పరిస్థితుల్లో సంపూర్ణ ఆరోగ్యం పొందాలంటే యోగా తప్పనిసరి. యోగా ప్రాధాన్యతను గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా ప్రణాళిక సిద్ధం చేసింది. జిల్లాకు 10 యోగా కేంద్రాలను మంజూరు చేసి నిధులు విడుదల చేయగా ఇప్పటికే షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఏడాదైనా ఒక్క కేంద్రం ప్రారంభానికి నోచుకోలేదు. ఇటీవల ప్రభుత్వం ఆశ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చి నియామకాలు చేపట్టింది. దీంతో త్వరలో జిల్లావాసులకు ఉచిత యోగా శిక్షణ అందుబాటులోకి రానుంది.

ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా..

ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా ఆయుష్ ఆస్పత్రులను హెల్త్ వెల్‌నెస్ కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు కేంద్రం యోగా కేంద్రాల కోసం నిధులు మంజూరు చేసింది. నేషనల్ ఆయుష్ మిషన్ ప్రకటించినట్లు జిల్లాలో 40కి పైగా యోగా కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా, 10 కేంద్రాలకు మాత్రమే మంజూరు ఇచ్చింది. కేంద్రాల ఏర్పాటుకు కద్దాల్, దేహేగాం, పొన్కల్, తానూరు, బాసర, కుంటాల, గుండంపల్లి, పల్సి, జిల్లా యునాని, జిల్లా ఆయుష్ నిర్మల్‌ను ఎంపిక చేశారు. ఒక్కో కేంద్రానికి రూ.6 లక్షల చొప్పున కేటాయించగా, షెడ్లు నిర్మించారు.

20 మంది ట్రైనర్ల నియామకం

కేంద్ర ప్రభుత్వం జిల్లాకు 10 యోగా కేంద్రాలు ఏర్పాటు చేసి జిల్లావ్యాప్తంగా షెడ్ల నిర్మాణం చేపట్టింది. ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ.6లక్షల చొప్పున రూ.60 లక్షల మంజూరు చేసింది. ఆయా జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో నిర్మాణ బాధ్యతలను ఆర్‌అండ్‌బీ, పీఆర్, టీఎస్ఎంఐడీసీలకు అప్పగించింది. అధికారులు ప్రతీ కేంద్రానికి ఇద్దరు ఆశ కార్యకర్తలను నియమించి శిక్షణ ఇప్పించారు. కేంద్రానికి ఒక మగ, ఒక ఆడ శిక్షకులను నియమించారు.

ప్రభుత్వం మారడంతో..

ఏడాది కిందటే కేంద్రాలు అందుబాటులోకి వచ్చినా శిక్షకుల నియామకంపై స్పష్టత లేక షెడ్లకు తాళాలు వేశారు. గత ప్రభుత్వం స్థానికంగా ఉన్న ఆశ కార్యకర్తలను గుర్తించి జాబితాను పంపించాలని ఆయుష్ విభాగం జిల్లా ఇన్‌చార్జీలను కోరింది. వారికే శిక్షణ ఇచ్చి శిక్షకులుగా నియమించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. అంతలోనే ఎన్నికల కోడ్ రావడం, బీఆర్ఎస్ ప్రభుత్వం స్థానంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో మళ్లీ కథ మొదటికొచ్చింది. యోగా శిక్షణ ఇచ్చేందుకు నిర్మించిన షెడ్లు వినియోగంలో లేక పలుచోట్ల స్టోర్ రూంలుగా మారాయి. మరికొన్ని చోట్ల షెడ్ పరిసరాలు అపరిశుభ్రంగా తయారై కళావిహీనంగా మారాయి.

త్వరలో ప్రారంభిస్తాం



జిల్లాలో త్వరలో యోగా కేంద్రాలను ప్రారంభిస్తాం. కమిషనర్ ఆదేశాలతో ఆశ కార్యకర్తలకు శిక్షణ ఇప్పించాం. జిల్లాలోని 10 కేంద్రాలకు 20 మంది సిబ్బంది నియామకం పూర్తయింది. కలెక్టర్ ఆదేశాలతో త్వరలోనే కేంద్రాలను అందుబాటులోకి తీసుకువస్తాం. జిల్లా ప్రజలు ఉచిత యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి.

– గంగదాస్, ఆయుష్ మెడికల్ ఆఫీసర్

సద్వినియోగం చేసుకోవాలి



కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఉచిత యోగా శిక్షణ కేంద్రాలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ముందుగా యోగా ప్రాముఖ్యతను తెలుసుకోవాలి. జిల్లాలో ఏర్పాటు చేసిన 10 కేంద్రాలు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి.

– కొరిపెల్లి శ్రావణ్‌రెడ్డి, నిర్మల్

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం



సోన్: న్యూవెల్మల్ బొప్పారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2009-10లో పదోతరగతి చదివినవారంతా ఆదివారం ఆత్మీయ సమ్మేళనం పేరుతో పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. ఆటాపాటలతో సందడి చేశారు. అప్పటి ఇన్‌చార్జి హెచ్ఎం మోహన్‌రావు, గజరాజ్‌గౌడ్, రాజేందర్‌రాజు, రామకృష్ణరావు, మునీందర్‌రాజు, శ్రీనివాస్, రమేశ్, భారతి, గోదావరి, అబ్దుల్‌హై తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్–3 పరీక్షలు



నిర్మల్‌లో సెయింట్ థామస్‌లోని కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్



అభ్యర్థుల హాల్‌టికెట్‌ను తనిఖీ చేసి కేంద్రంలోకి పంపుతున్న అధికారులు

- కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ
- పేపర్–1కు 57.98% మంది అభ్యర్థులు
- పేపర్–2కు 57.73% మంది హాజరు
- కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ

నిర్మల్ రూరల్: జిల్లాలో ఆదివారం జరిగిన గ్రూప్–3 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పేపర్–1 పరీక్ష, మధ్యాహ్నం 3నుంచి 5.30 గంటల వరకు పేపర్–2 పరీక్ష నిర్వహించారు. నిమిషం నిబంధన, బయోమెట్రిక్ అమలు చేసి గంట ముందుగానే అభ్యర్థులను పరీక్షాకేంద్రాల్లోకి అనుమతించారు. జిల్లాలో 24 పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేశారు. పేపర్–1 పరీక్షకు 8,124కి 4,710 (57.98%) మంది అభ్యర్థులు హాజరు కాగా, 3,414 మంది గైర్హాజరయ్యారు. పేపర్–2కు 8,124 మందికి 4,690 (57.73%) మంది అభ్యర్థులు హాజరు కాగా, 3,434 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. కలెక్టర్ అభిలాష అభినవ్ సెయింట్ థామస్, చాణక్య పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షాకేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్ జిల్లా కేంద్రంలోని వాసవి, రవి, విన్నర్స్ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షాకేంద్రాలను పరిశీలించారు. సోమవారం పేపర్–3 పరీక్ష ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు నిర్వహించనున్నారు.

కేంద్రాల వద్ద పకడ్బందీ బందోబస్తు



సెయింట్ థామస్ పాఠశాలలోని కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్‌టౌన్: గ్రూప్–3 పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ జానకీ షర్మిల తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పరీక్షాకేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు పరీక్షాకేంద్రాల వద్ద 163, 144 సెక్షన్లు అమలు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్రాలకు చేరుకునే సమయంలో అభ్యర్థులకు ఏవైనా ఇబ్బందులుంటే ఆయా పరిధిలోని పోలీస్ అధికారులను లేదా 'డయల్ 100'ను సంప్రదించాలని సూచించారు. ఎస్పీ వెంట పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, సోన్ సీఐ నవీన్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలి

- ఎస్పీ జానకీ షర్మిల
- సిర్పెల్లి చెక్‌పోస్టు తనిఖీ



వివరాలు పరిశీలిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

సారంగాపూర్: ఈనెల 20వ తేదీన నిర్వహించనున్న మహారాష్ట్ర సాధారణ ఎన్నికల నేపథ్యంలో ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిల సూచించారు. మండలంలోని సిర్పెల్లి గ్రామంలో తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆదివారం పరిశీలించారు. ఇప్పటివరకు చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేసి పట్టుకున్న వాహనాల వివరాలు, పట్టుబడిన వస్తువులు, నగదు తదితర వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేయడానికి డబ్బు, మద్యం, ఇతర సామగ్రిని తరలిస్తే తనిఖీ చేసి పట్టుకోవాలని సూచించారు. ఆయా శాఖల సమన్వయంతో కలిసికట్టుగా పనిచేయాలని తెలిపారు. చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వర్తించే సిబ్బందికి అవసరమైన వసతులు కల్పించాలని ఎస్సై శ్రీకాంత్‌ను ఆదేశించారు. స్థానిక పోలీస్ సిబ్బంది ఉన్నారు.

గుస్సాడీ కళాకారులకు చెక్కులు



సారంగాపూర్: చెక్కులు అందుకున్న గుస్సాడీ కళాకారులతో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

సారంగాపూర్: దండారీ, గుస్సాడీ కళాకారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆదివారం జిల్లా కేంద్రంలో పంపిణీ చేశారు. 12మంది కళాకారుల బృందానికి రూ.15వేల చొప్పున నాలుగు బృందాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సారంగాపూర్ మండలంలోని ఇప్పచెలిమ, పెండల్‌దరి, అంతుల్వాయి, ఆదివాసీగూడ గ్రామాలకు చెందిన కళాకారులకు చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆచారం, సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా దండారీ ఉత్సవాల్లో గుస్సాడీ నృత్యాన్ని నేటి తరానికి పరిచయం చేస్తున్న కళాకారులను అభినందించారు. కార్యక్రమంలో పటేల్ నాగోరావు, సుదర్శన్, జంగు తదితరులున్నారు.

187 మందికి సీఎంఆర్ఎఫ్..

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ పట్టణం, మండలం, సోన్, దిలావర్‌పూర్, నర్సాపూర్, లక్ష్మణచాంద, మామడ మండలాలకు చెందిన 187 మంది లబ్ధిదారులకు రూ.40 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆదివారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బడిని పునఃప్రారంభించాలి



పాఠశాలను పునఃప్రారంభించాలని కోరుతున్న విద్యార్థులు, పోషకులు

కడెం: మండలంలోని పాండ్వపూర్ పంచాయతీ పరిధి పాండ్వపూర్‌తండా, కాశిగూడ గ్రామాలకు చెందిన 30 మంది విద్యార్థుల కోసం ప్రభుత్వ పాఠశాలను పునఃప్రారంభించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్యా రాజేశ్ నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం పాండ్వపూర్ తండాకు వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. గతంలో ఈ రెండు గ్రామాల విద్యార్థుల కోసం గ్రామంలో పాఠశాలను నడిపించారని తెలిపారు. మూడేళ్లుగా ఉపాధ్యాయులు రాక విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. డ్యాంగూడలో పాఠశాల ఉన్నా దారి లేదని, పొలాలు దాటి వెళ్లేందుకు విద్యార్థులు భయపడుతున్నారని తెలిపారు. కలెక్టర్, ప్రజాప్రతినిధులు స్పందించి పాఠశాలను తెరిపించాలని రాజేశ్‌తోపాటు తల్లిదండ్రులు కోరుతున్నారు.

క్లుప్తంగా

పోడుకోసం చెట్లు నరికివేత



లింగాపూర్ బీట్‌లో చెట్లు నరికివేసిన దృశ్యం

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ అటవీ బీట్ పరిధిలో 380 కంపార్ట్‌మెంట్‌లో పోడు వ్యవసాయం కోసం కొందరు వ్యక్తులు ఆదివారం తెల్లవారుజామున సుమారు ఎకరం స్థలంలో సుమారు 70 చెట్లకు పైగా నరికివేశారు. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకునే లోపు వారంతా పారిపోయారు. ఈ విషయమై తాళ్లపేట ఎఫ్ఆర్వో సుష్మరావును వివరణ కోరగా అటవీ భూమిలో చెట్లు తొలగించిన విషయం వాస్తవమే, చెట్లను తొలగించినవారు దమ్మన్నపేటకు చెందిన వారిగా గుర్తించామన్నారు. వారందరికీ కౌన్సెలింగ్ ఇచ్చి అటవీ భూమిలో చెట్లను తొలగించొద్దని అవగాహన కల్పిస్తామని చెప్పారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



పట్టుకున్న ట్రాక్టర్లు

జన్నారం: జన్నారం అటవీ రేంజ్ ఇందన్‌పల్లి రేంజ్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను ఆదివారం రాత్రి పట్టుకున్నట్లు రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ తెలిపారు. పక్కా సమాచారంతోనే సిబ్బందితో నిఘా పెట్టగా ఇసుకతో మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి రేంజ్ కార్యాలయానికి తరలించామన్నారు. సెక్షన్ అధికారి రవి, బీట్ అధికారి ముజీబొద్దీన్ ఉన్నారు.

దాతలు సాయం కోసం ఎదురుచూపు



మంచంపట్టిన కిరణ్‌తో తల్లి అమృత

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్ కాలనీకి చెందిన నిరుపేద యువకుడు అమంద కిరణ్ అనారోగ్యంతో మంచం పట్టాడు. కడుపు ఉబ్బసం, కాలేయం చెడిపోయి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తండ్రి శ్రీనివాస్ గత కొన్నేళ్ల క్రితం అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి అమృత వంట పనులు చేస్తోంది. అప్పులు చేసి కుమారుడికి వైద్య చికిత్స అందిస్తోంది. అయినా కిరణ్ ఆరోగ్యం మెరుగుపడడం లేదు. ప్రస్తుతం చేతిలో చిల్లిగవ్వ లేక దయనీయ పరిస్థితిలో దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది. దాతలు ఫోన్ పే, గూగుల్ పే నంబర్ 9550227132 నంబర్‌లో నగదు పంపించాలని కోరింది.

పుస్తక పఠనం- పునర్వైభవంపై సెమినార్

మంచిర్యాలఅర్బన్: గ్రంథాలయ 57వ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయాలు–పుస్తక పఠనం - పునర్వైభవం అనే అంశంపై ఆదివారం సెమినార్ నిర్వహించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ పుస్తక పఠనం వికాసాన్ని, విజ్ఞానాన్ని అందిస్తుందన్నారు. పఠనం ద్వారా వివిధ భాషలపై పట్టు పెరుగుతుందని పేర్కొన్నారు. గ్రంథాలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కవులు, స్థానికులు శ్రీనివాస్, భూపతి సంతోష్, మల్లేశం, లైబ్రేరియన్లు మురళి, గోపి, రమేశ్ పాల్గొన్నారు.

జిల్లాల్లో పారామెడికల్ కోర్సులు

- నిర్మల్ వైద్య కళాశాలలో డీఎంఎస్టీ, డీఈసీజీ
- మంచిర్యాలలో డీఎంఎల్‌టీ, డీఎంఎస్టీ
- ఆయా కోర్సుల్లో మొత్తం 120 సీట్లు
- 20 వరకు దరఖాస్తు గడువు



నిర్మల్ ప్రభుత్వ మెడికల్ కళాశాల

నిర్మల్‌ఖైన్‌గేట్/మంచిర్యాలటౌన్: అనేక వ్యాధులకు చికిత్స అందించడంలో వైద్యుల పాత్ర ఎంత కీలకమో వారికి తెర వెనుక సహకారం అందించడంలో పారా మెడికల్ సిబ్బంది పాత్ర కూడా అంతే కీలకం. అంత ప్రాముఖ్యత కలిగిన పారామెడికల్ కోర్సులను అభ్యసించడానికి జిల్లా విద్యార్థులకు అవకాశాలు అందివచ్చాయి. నిర్మల్ ప్రభుత్వ వైద్య కళాశాలలో రెండు కోర్సుల్లో ప్రవేశాలకు పారా మెడికల్ బోర్డు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ ఏడాది నుంచే డీఎంఎస్టీ, డీఈసీజీ కోర్సులు ప్రారంభం కానున్నాయి.

మెరుగవనున్న వైద్య సేవలు

పారామెడికల్ కోర్సులు ప్రారంభమైతే జిల్లా జనరల్ ఆస్పత్రిలో సేవలు మరింత మెరుగయ్యే అవకాశాలున్నాయి. ఇప్పటికే ఎంబీబీఎస్ రెండో సంవత్సరం విద్యార్థులు జిల్లా జనరల్ ఆస్పత్రికి వెళ్లాల్సి ఉంటుంది. అలాగే పారామెడికల్ కోర్సుల్లో చేరే వారు సైతం జిల్లా ఆస్పత్రిలో ప్రాక్టికల్స్‌కు వెళ్లడంతోపాటు మధ్యాహ్న సమయంలో వైద్య కళాశాలలో తరగతులకు హాజరుకావాల్సి ఉంటుంది.

ఇంటర్ పాసైన వాళ్లు అర్హులు

వైద్య సేవలు అందించేందుకు వైద్యులతోపాటు పారామెడికల్ సిబ్బందికి కూడా ప్రభుత్వం అవసరమైన వైద్య కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చింది. పారామెడికల్‌లో మొత్తం 21 కోర్సులు ఉండగా నిర్మల్ ప్రభుత్వ వైద్య కళాశాలలో డిప్లొమా ఇన్ మెడికల్ స్టెరిలైజేషన్ మేనేజ్‌మెంట్ అండ్ ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్ (డీఎంఎస్టీ), డిప్లొమా ఇన్ ఈసీజీ టెక్నీషియన్ (డీఈసీజీ) కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఒక్కో కోర్సులో 30 సీట్ల చొప్పున కేటాయించారు. ఈ కోర్సుల కాలవ్యవధి రెండేళ్లు. ఇంటర్ బైపీసీ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ కోర్సులకు అర్హులు. అయితే బైపీసీ విద్యార్థులు లేకపోతే ఇంటర్‌లో ఇతర కోర్సులు చేసిన వారికి సైతం అవకాశం కల్పించనున్నారు. ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు ఫారం, ఇతర వివరాలకు www. tgpmb. telangana. gov. in వెబ్‌సైట్‌ను సంప్రదించాలి.

మంచిర్యాలలో..

మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాల 2022లో ఏర్పడగా, ఇటీవలే మూడో ఏడాదిలోకి అడుగుపెట్టింది. 100 ఎంబీబీఎస్ సీట్లతో ప్రస్తుతం 300ల మంది వైద్య విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పారా మెడికల్‌లో 21 కోర్సులు ఉన్నాయి. డీఎంఎల్టీ, డీఎంఎస్‌టీ కోర్సులు ప్రారంభించింది. డీఎంఎల్టీ (డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్)లో 30 సీట్లు, డీఎంఎస్‌టీ (డిప్లొమా ఇన్ మెడికల్ స్టెరిలైజేషన్ మేనేజ్‌మెంట్ అండ్ ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్)లో 30 సీట్లతో అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ కోర్సుల కాలవ్యవధి రెండేళ్లు. ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. దరఖాస్తు ఫారం, వివరాలకు www. tgpmb. telangana. gov. in వెబ్‌సైట్‌ను సంప్రదించడం, 040-24653519 నంబరులో సంప్రదించాలి.



మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాల

దరఖాస్తు చేసుకోవాలి



నిర్మల్ వైద్య కళాశాలలో డీఎంఎస్టీ, డీఈసీజీ కోర్సులు ప్రారంభించాం. ఈ రెండు కోర్సులకు కలిపి 60 సీట్లు కేటాయించాం. ఈ కోర్సులు చేసినవారికి మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలుంటాయి. ఇంటర్ పూర్తి చేసిన అర్హులైన విద్యార్థులు ఈనెల 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి.

– శ్రీనివాస్, ప్రిన్సిపాల్, మెడికల్ కళాశాల, నిర్మల్

గూడెంలో కార్తిక పూజలు



సత్యనారాయణ వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో కార్తిక పూజలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆదివారం భక్తులు తరలివచ్చి సత్యదేవున్ని దర్శించుకున్నారు. సుమారు 425 జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోము కున్నారు. దీంతో ఆలయ ప్రాంగణాలు భక్తులతో రద్దీగా కనిపించాయి.



సత్యదేవున్ని దర్శించుకుంటున్న భక్తులు

రెండు చేతులు లేకపోయినా...

- గ్రూపు-3 పరీక్షలకు హాజరైన జాకీర్‌పాషా

కాగజ్‌నగర్‌రూరల్: అంగవైకల్యం చదువుకు ఏమాత్రం అడ్డుకాదని నిరూపిస్తున్నాడు కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్‌లోని చారిగాం ఏరియాకు చెందిన జాకీర్‌పాషా. పుట్టుకతోనే రెండు చేతులు లేకపోయినప్పటికీ పట్టుదలతో ఉన్నత చదువులు చదివి ఉద్యోగం సాధించాలనే తపనతో నిరంతరం తన ప్రయత్నాలు కొనసాగిస్తున్నాడు. ఆదివారం నిర్వహించిన గ్రూపు–3 పరీక్షకు ఉత్సాహంగా హాజరై పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయంలోని పరీక్షా కేంద్రంలో కాలితో పరీక్ష రాశాడు. గతంలో కూడా ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో కూడా తన బాధ్యతగా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటుహక్కును వినియోగించుకున్నాడు. అంతే కాకుండా హరితహారం కార్యక్రమాల్లో కూడా చురుగ్గా పాల్గొని కాలితో మొక్కలు నాటడం, రాయడం, పెయింటింగ్ వేయడంలాంటి కార్యకలాపాలు కొనసాగిస్తున్నాడు.



పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న జాకీర్‌పాషా

జీవితంపై విరక్తితో యువకుడు ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: జీవితంపై విరక్తితో యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వినిత తెలిపారు. ఆమె కథనం ప్రకారం..జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన అనుదీప్(30) ప్రైవేటు డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. గతంలో ఓ యువతితో ప్రేమ వ్యవహారంలో గొడవలు జరుగగా, రైల్వేట్రాక్‌పై ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటనలో స్వల్పగాయాలై ప్రాణాలతో బయటపడ్డాడు. అప్పటి నుంచి తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఎవరూ పెళ్లి చేసుకోరని మద్యానికి బానిసై ఏమి పనిచేయకుండా తిరుగుతుండేవాడు. శనివారం రాత్రి మద్యం తాగి వచ్చి ఇంట్లో ఉరేసుకున్నాడు. తల్లి ఉమ తెల్లారి చూసేసరికి చీరతో దూలానికి అనుదీప్ ఉరేసుకుని చనిపోయి ఉన్నాడు. తల్లి ఉమ ఫిర్యాదుతో ఆదివారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



అనుదీప్ (ఫైల్)

పురుగుల మందు తాగి వ్యక్తి..

తాంసి: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్సై ముంతాజ్ తెలిపారు. ఏఎస్సై కథనం ప్రకారం.. భీంపూర్ మండలం బుర్కపల్లి గ్రామానికి చెందిన కుడ్మేత రాంచందర్ (35) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో శనివారం వరుసకు సోదరుడైన వ్యక్తి ఇంటికి అతని లేని సమయంలో వెళ్లాడు. దీంతో వరుసకు సోదరుడు మందలించడంతో రాంచందర్ అవమానంగా భావించాడు. ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు రాత్రి వెతికినా ఆచూకీ దొరకలేదు. ఆదివారం మధ్యాహ్నం గుబిడిపల్లి శివారులో పురుగులమందు తాగి విగతజీవిగా పడి ఉన్నాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్సై ముంతాజ్ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. మృతుడి భార్య మమత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఆస్తి తగాదాలతోనే కొడుకుపై కత్తిదాడి

నార్నూర్: మండలంలోని గుంజాల గ్రామంలో శనివారం రాత్రి కొడుకుపై తండ్రి కత్తితో దాడి చేసిన విషయం తెలిసిందే. ఆస్తి తగాదాలతోనే కొడుకుపై తండ్రి కత్తితో దాడి చేసినట్లు సీఐ రహీం పాషా తెలిపారు. ఆయన క థనం ప్రకారం..గ్రామానికి చెందిన మెస్రం భుజంగరావుకు ముగ్గురు కొడుకులు ఉన్నా రు. నాలుగెకరాల వ్యవసాయ భూమి ఉంది. పెద్ద కొడుకు బాలాజీకి రంధాబాయితో పెళ్లయింది. వీరికి రెండు నెలల కుమారుడు ఉన్నాడు. ఆస్తిలో వాటా కావాలని కొన్నిరోజులుగా తండ్రి కొడుకుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. శనివారం సాయంత్రం వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికొచ్చిన తండ్రితో బాలాజీ గొడవపడ్డాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న తండ్రి ఆవేశానికి లోనై బాలాజీ కడుపులో కత్తితో పొడవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆదిలాబాద్ రిమ్స్‌లో బాలాజీ చికిత్స పొందుతున్నాడు. తండ్రి పరారీలో ఉన్నాడు. బాధితుడి భార్య ఫిర్యాదుతో ఆదివారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

నస్పూర్: సింగరేణిలో పని చేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంతోటి నాగేశ్వర్‌రావు అన్నారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులతో కలిసి మాట్లాడారు. కొత్తగూడెంలోని సింగరేణి కార్పొరేట్ కార్యాలయంలో ఈనెల 12న లైజర్ సెల్ ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. లైజర్ సెల్ ద్వారా ఎస్సీ ఎస్టీ, మైనార్టీ మహిళా కార్మికుల సమస్యల పరిష్కారం సులభతరం అవుతుందన్నారు. దీని ఏర్పాటుకు సహకరించిన ఎస్సీ ఎస్టీ మిషన్‌కు, సింగరేణి సీఎండీ బలరాం తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణిలో ఎస్సీ, ఎస్టీ కార్మిక సంఘం ఒకటే ఉందన్నారు. ఎవరు ఎలాంటి ప్రకటనలు చేసినా కార్మికులు అయోమయానికి గురికావొద్దన్నారు. త్వరలో అన్ని ఏరియాల్లో పర్యటించి కార్మికుల సమస్యలు తెలుసుకుంటామన్నారు. సమావేశంలో ఇరావుల శ్రీనివాస్ సెంట్రల్ కమిటీ మెంబర్, డేగల ప్రవీణ్‌కుమార్ వైస్ ప్రెసిడెంట్, నాయకులు అంద వెంకట్, లక్ష్మణ్, వేల్పుల ప్రవీణ్, వాసు, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వర్‌రావు

మహారాష్ట్రలో ఏపీ డిప్యూటీ సీఎం ప్రచారం

ఆసిఫాబాద్: మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా బల్లార్షా బీజేపీ అభ్యర్థి సుధీర్ మునిగంటివార్ తరఫున ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. బల్లార్షాలో తెలుగు ఓటర్లు ఉండడంతో ఇక్కడి నాయకులు పాల్గొన్నారు. ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, పార్టీ రాష్ట్ర నాయకులు బోనగిరి సతీశ్‌బాబు, బీజేవైఎం రాష్ట్ర అధికారి ప్రతినిధి ఎలగతి సుచిత్, శ్రావణ్‌గౌడ్, ఇగురపు సంజీవ్, జిల్లా నాయకులు ఉన్నారు.



ప్రచారంలో పవన్‌కల్యాణ్‌తో నాయకులు

భయం గుప్పిట్లో గ్రామాలు

- నాగాపూర్, చాందూర్ గ్రామాల్లో పెద్దపులి సంచారం
- ఎద్దుపై దాడితో భయాందోళనలో గ్రామస్తులు



నాగాపూర్ శివారులో గుర్తించిన పులి పాదముద్రలు



పులి సంచారంతో జామ్‌డా సమీపంలో గుమిగూడిన గిరిజనులు

ఉట్నూర్‌రూరల్/నార్నూర్: నిర్మల్ జిల్లాకేంద్రం నుంచి సంచరిస్తూ వస్తున్న పెద్దపులి శుక్రవారం పెంబి మండలంలో గేదె, దూడపై దాడి చేసింది. శనివారం పెంబి దోందరి, చిసిచెల్మ రేంజ్ పరిధిలోని వంకతుమ్మ ప్రాంతంలో ఎద్దుపై దాడి చేసి గాయపర్చింది. అక్కడి నుంచి ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం నాగాపూర్‌లో ఆదివారం కనిపించింది. ఉదయం వాకింగ్‌కు వెళ్లిన యువకులు పులిని గుర్తించి గ్రామస్తులకు సమాచారం అందించారు. వెంటనే వారు అక్కడికి చేరుకుని నీటి కాల్వలో పులి పాదముద్రలు గుర్తించి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. మధ్యాహ్నం చాందూర్ సమీపంలో రాజుల్‌గూడకు చెందిన కుమ్ర ఆనంద్‌కు చెందిన ఎద్దుపై దాడి చేసి గాయపర్చిందని స్థానికులు పేర్కొన్నారు. డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్, ఉట్నూర్ ఎఫ్ఆర్వో శిలానంద్.. నాగాపూర్, చాందూర్ గ్రామాలను సందర్శించారు. పాదముద్రలను గుర్తించి పులిగా నిర్ధారించారు. స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. చుట్టుపక్కల గ్రామస్తులను అప్రమత్తం చేశారు. రెండు రోజులపాటు పంట పొలాలకు, బయటికి వెళ్లొద్దన్నారు. పొలాల వద్ద విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయొద్దన్నారు. ప్రస్తుతం పులి..నాగాపూర్, చాందూరి మీదుగా నార్నూర్ మండలం జామడ వైపుగా వెళ్లిందని అధికారులు నిర్ధారించారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నార్నూర్, జైనూర్ మండలాల మీదుగా జోడేఘాట్ అడవులకు వెళ్లనుందని, అక్కడ ఆడపులి సంచరిస్తుందని అధికారులు పేర్కొన్నారు. పులి సంచారంతో గిరిజన గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

పులి సంచారంతో గ్రామస్తుల ఆందోళన

ఉట్నూర్, నార్నూర్ ప్రాంతంలో పులి సంచారంతో మండలంలోని జామ్‌డా, తాడిహత్నూర్, గుంజాల, నాగల్‌కొండ, పట్నాపూర్, మహగావ్, చోర్గావ్ గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఎఫ్ఎస్‌వో సుదర్శన్ జాదవ్ తెలిపిన వివరాలు.. ఆదివారం ఉట్నూర్ మండలంలోని నాగాపూర్ వద్ద వాకింగ్ చేస్తున్న కొందరు యువకులకు పులి కనిపించడంతో వారు భయంతో పరుగులు తీశారు. హస్నాపూర్, శంకర్‌నాయక్ తండా మీదుగా మధ్యాహ్నం నార్నూర్ మండలం జామ్‌డా శివారులో పశువులు మేత మేస్తుండగా పులి ఆవుపై దాడి చేసింది. కాపరి కేకలతో అక్కడి నుంచి వెళ్లిపోయిందని గ్రామస్తులు తెలిపారు. డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని పులి పాదముద్రలను గుర్తించారు. నార్నూర్ మండలం జామ్‌డా, తాడిహత్నూర్, నాగల్‌కొండ, చోర్గావ్, బాబేఝరి, సుంగాపూర్, మహగావ్ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రెండురోజులపాటు ప్రజలు పత్తి ఏరేందుకు గాని ఇతర వ్యవసాయ పనులకు వెళ్లొద్దని సూచించారు. సోలార్ జట్కా మిషన్, కరెంట్ తీగలను ఎవరూ పెట్టవద్దన్నారు. జామ్‌డా నుంచి కుమురం భీం జిల్లా జైనూర్ మండలం మీదుగా కెరమెరి మండలం జోడేఘాట్ అటవీ ప్రాంతానికి పులి వెళ్లిపోతుందన్నారు.

గిరిజనుడిని చితకబాదిన అధికారులు



గిరిజన సంఘం నాయకులతో కలిసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన రవీందర్

- రామలక్ష్మణుల గుట్ట వద్ద ఘటన
- పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాల ఫిర్యాదు

వేమనపల్లి: గిరిజనుడిని అటవీ అధికారులు చితకబాదిన ఘటన మండలంలోని సుంపుటం అటవీ ప్రాంతంలోని రామలక్ష్మణుల గుట్ట వద్ద చోటుచేసుకుంది. బాధితుడు, కళ్లంపల్లి గ్రామానికి చెందిన గిరిజనుడు కుస్రం రవీందర్ తెలిపిన వివరాలు.. ఈనెల 15న తన బావ ఆత్రం బక్కయ్యతో కలిసి రామలక్ష్మణుల గుట్ట వద్దకు చీపురు సేకరణ కోసం వెళ్లాను. అక్కడే ఉన్న తిరుమాను చెట్లకు లక్క ఉండటంతో చెట్టును నరికి సేకరించారు. సమాచారం అందుకున్న ఎఫ్ఎస్ఓ బేగ్, వేమనపల్లి ఎఫ్‌బీవో సోఫియాబేగం భర్త పాషా అక్కడికి వెళ్లారు. అధికారులను చూసి బక్కయ్య పరుగెత్తగా రవీందర్‌ను అదుపులోకి తీసుకుని కొట్టారు. బైక్‌పై కుశ్నపల్లి అటవీ కార్యాలయానికి తరలించి థర్డ్ డిగ్రీ ప్రయోగించారని బాధితుడు తెలిపాడు. ఆదివారం తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం, మాజీ ఎంపీపీ కుర్రు వెంకటేశంలతో కలిసి నీల్వాయి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



అధికారుల దాడిలో గాయపడిన రవీందర్

ఎలాంటి దాడి చేయలేదు

కళ్లంపల్లి గ్రామస్తులు గతేడాదిగా లక్క సేకరణ కోసం చెట్లను నరుకుతున్నారు. 15న అటవీ ప్రాంతానికి వెళ్లిన తమను చూసి అందరూ పరారయ్యారు. రవీందర్ పరుగెత్తగా కిందపడగా గాయాలయ్యాయి. అతడిపై దాడికి చేయలేదు. కేసు పెడతారనే నెపంతో దాడి చేసినట్లు వారు ఆరోపణ చేస్తున్నారు. కాగా, వేమనపల్లిలో తాను అద్దెకు ఉంటున్న ఇంటి వద్దకు వచ్చి కళ్లంపల్లి గ్రామస్తులు దాడికి యత్నించారని ఎఫ్‌బీఓ సోఫియాబేగం డీఆర్‌వో రూపేష్, భర్త పాషాతో కలిసి నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

– బేగ్, ఎఫ్ఎస్ఓ